క్లుప్తంగా

అయోధ్య రామబాణ దర్శనం.. తరించిన భక్తజనం



అయోధ్య రామబాణం వద్ద భక్తులు

మద్దిలపాలెం: అయోధ్య రామాలయానికి అందజేయనున్న వెండి ధనుస్సును కొత్త వెంకోజీపాలెం వైభవ్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల సందర్శనార్థం ఉంచారు. హైదరాబాద్‌కు చెందిన చల్లా శ్రీనివాస శాస్త్రి కేజీ బంగారం, 14 కేజీల వెండితో రామబాణాన్ని తయారు చేయించారు. గురువారం శ్రీరామ కోదండాన్ని స్థానికులతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అనేక మంది భక్తులు తరలి వచ్చి సందర్శించుకున్నారు.

వేడుకగా చవితి రాట



ఉత్సవ రాట వేస్తున్న యూత్ బృందం

మద్దిలపాలెం: నియోజకవర్గంలో వినాయక చవితి సందడి మొదలైంది. పాత వెంకోజీపాలెంలోని రామాలయం వద్ద సీతారామ సేవా సంఘానికి చెందిన లేజీ బాయ్స్ యూత్ అసోసియేషన్ గురువారం ఉత్సవ రాట వేసింది. ఇక్కడ వినాయక నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని యూత్ ప్రతినిధులు పేర్కొన్నారు.

అనాథలకు దుప్పట్ల పంపిణీ



అనాథలకు దుప్పట్లు అందజేస్తున్న నాస్తిక సమాజం సభ్యులు

ఆరిలోవ: భారత నాస్తిక సంఘం మహిళా నాయకురాలు శారద నాలుగో వర్ధంతి సందర్భంగా గురువారం ఆరిలోవ సిద్ధార్థనగర్‌లోని నాస్తిక సంఘం కేంద్ర కార్యాలయంలో సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి సభ్యులు నివాళులర్పించారు. అనంతరం ఆరిలోవ, ఆర్టీసీ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో అనాథలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాస్తిక సమాజం జిల్లా అధ్యక్షుడు వై.నూకరాజు మాట్లాడుతూ శారద మరణించే వరకు మహిళా హక్కుల కోసం పోరాడారన్నారు. ఆమె ఆశయ సాధనకు కృషి చేయాలి సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు జె.రవి, టి.శ్రీరామమూర్తి, విజ్ఞానంద, రమణి, సునీత పాల్గొన్నారు.

వదలని వాన



జోరువానతో తడిసి ముద్దయిన మద్దిలపాలెం

మద్దిలపాలెం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో జనం ఇబ్బందులకు గురవుతున్నారు. బుధవారం రాత్రి నుంచి గురువారం రోజంతా వాన కురవడంతో చాలా మంది ఇళ్లకు పరిమితమయ్యారు. కొందరు వాహన చోదకులు, పాదచారులు తడస్తూనే రాకపోకలు సాగించారు. వర్షం నీటితో కాలువలు పొంగి పొర్లుతున్నాయి. రోడ్లు చెరువులను తలపించాయి. ఇసుకతోట, మద్దిపాలెం, కేఆర్ఎం కాలనీ, శివాజీపాలెం, పిఠాపురం కాలనీ సర్వీస్ రోడ్లు వర్షపు నీటితో నిండిపోయాయి. పిఠాపురం కాలనీ ఎస్‌బీఐ బ్రాంచీ ఎదురుగా రోడ్డుపై చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. కాసేపు జనజీవనం స్తంభించింది. రోడ్లపైకి గొడుగు లేకుండా కాలు బయట పెట్టలేకపోయారు. చిరువ్యాపారులు వర్షం కారణంగా బేరాలు లేక ఉసూరు మన్నారు.

ఇదేనా.. బ్యూటిఫికేషన్!

- ఏఎస్ రాజా కూడలిలో పనిచేయని వాటర్ ఫౌంటెయిన్
- స్మార్ట్ సిటీ పనుల్లో డొల్లతనం
- నిర్వహణను పట్టించుకోని జీవీఎంసీ



దెబ్బతిన్న కాబుల్ స్టోన్ ఫ్లోరింగ్



ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా కూడలిలో పనిచేయని వాటర్ ఫౌంటెయిన్

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా కూడలిలో ఆధునికీకరించిన వాటర్ ఫౌంటెయిన్ మూలకు చేరింది. స్మార్ట్ సిటీ పనుల్లో భాగంగా జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం(ప్రాజెక్ట్స్) ఈ జంక్షన్ ఆధునికీకరణ పనులను గతంలో చేపట్టింది. నగర వ్యాప్తంగా పలు ప్రధాన కూడళ్ల బ్యూటిఫికేషన్‌లో భాగంగా ఏఎస్ రాజా కూడలిని సైతం అందంగా తీర్చిదిద్దారు. జీవీఎంసీ నిర్వహణ లోపం.. ప్రాజెక్ట్స్ విభాగం చేసిన పనుల్లో నాణ్యతా లోపాల కారణంగా కూడలి బ్యూటిఫికేషన్‌పై విమర్శలు వినిపిస్తున్నాయి.

స్థానికుల అసంతృప్తి

ఇక్కడ అభివృద్ధి చేసిన వాటర్ ఫౌంటెయిన్‌పై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఫౌంటెయిన్ వెదజల్లే నీరు కనీసం అటుగా వెళ్లే వారికి సైతం కనిపించకపోవడమే ఇందుకు కారణం. ఇతర కూడళ్లలో ఫౌంటెయిన్లు నీటిని వెదజల్లుతో మిరిమిట్లు గొలుపుతుంటే.. ఇక్కడి ఫౌంటెయిన్ కనీస ఆకర్షణగా లేదంటూ విమర్శిస్తున్నారు. ప్రస్తుతం ఫౌంటెయిన్‌లో చాలా భాగం పనిచేయకపోవడంతో స్మార్ట్ సిటీ పనుల్లో నాణ్యతా లోపానికి.. నిర్వహణ పనుల్లో జీవీఎంసీ నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొంటున్నారు.

రూ.1.29 కోట్లతో పనులు

స్మార్ట్ సిటీ పనుల్లో భాగంగా జీవీఎంసీ ప్రాజెక్ట్స్ విభాగం ఏఎస్ రాజా జంక్షన్‌ను రూ.1.29 కోట్లతో అభివృద్ధి చేసింది. సర్కిల్ చుట్టూ కాబుల్ స్టోన్ ఫ్లోరింగ్ నిర్మించారు. సర్కిల్ మధ్యలోని ఐల్యాండ్‌ను పూర్తి గ్రానైట్ వర్క్‌తో తీర్చిదిద్దారు. సర్కిల్ మధ్యలో వాటర్ ఫౌంటెయిన్ ఏర్పాటు చేసి, ప్లాంటేషన్, బ్యూటిఫికేషన్ పనులు చేపట్టారు. కాబుల్ స్టోన్ ఫ్లోరింగ్ వర్క్‌ను స్టార్ ఆకారంలో తీర్చిదిద్ది సర్కిల్‌ను ఆకర్షణీయంగా మార్చారు. ఆయా పనుల్లో లోపించిన నాణ్యత, నిర్వహణ లోపం కారణంగా ప్రస్తుతం ఫౌంటెయిన్, కాబుల్ స్టోన్ ఫ్లోరింగ్ ఆకర్షణ కోల్పోతున్నాయి. జంక్షన్ చుట్టూ నిర్మించిన కాబుల్ స్టోన్ ఫ్లోరింగ్ కూడా అక్కడక్కడా దెబ్బతింది. అధికారులు దృష్టి సారించి దీన్ని సరిదిద్దకపోతే వర్షాకాలం కారణంగా మరికొన్ని రోజుల్లో ఫౌంటెయిన్ అధ్వానంగా మారి.. స్టోన్ వర్క్ మొత్తం శిథిలమవడం ఖాయమని స్థానికులు చెబుతున్నారు.

విద్యార్థులకు ధ్యాన్ చంద్ స్ఫూర్తి



మాట్లాడుతున్న ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు

మద్దిలపాలెం: మేజర్ ధ్యాన్‌చంద్ ఇచ్చిన స్ఫూర్తితో విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ద్రోణాచార్య అవార్డు గ్రహీత డాక్టర్ ఐ.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయనను ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్రీడల్లో రాణించి.. కళాశాలకు పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు ఇదే కళాశాల పూర్వ విద్యార్థి కావడం గర్వకారణమన్నారు. స్పోర్ట్స్ డైరెక్టర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులు అందించారు. స్పోర్ట్స్ కమిటీ సభ్యులు శామ్యూల్ డేవిడ్ రాజు, విజయప్రతాప్, శ్రీనివాస్ ప్రసాద్, శ్రావణ్ కుమార్, పీఆర్వో పి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

గురుకులంలో జాతీయ క్రీడా దినోత్సవం

ఆరిలోవ: శ్రీకృష్ణాపురం గురుకులంలో జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ రత్నవల్లి, పీఈటీలు, ఉపాధ్యాయులు సుప్రసిద్ధ భారత హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ చిత్రపటానికి నివాళులర్పించారు. గురుకులంలో క్రీడల్లో ప్రతిభ చూపుతున్న విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు, క్రీడా సర్టిఫికెట్లు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ రమేష్, వ్యాయామ ఉపాధ్యాయుడు జె.వివేకానందు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గురుకులంలో విద్యార్థులకు క్రీడా సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ రత్నవల్లి, పీఈటీలు



కేడీపీఎం స్కూల్‌లో విజేతలతో హెచ్‌ఎం సుమతీ బాయ్, క్లబ్ ప్రతినిధులు

క్రీడా పోటీల విజేతలకు బహుమతులు

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 20వ వార్డు ఈస్ట్ పాయింట్ కాలనీలోని కేడీపీఎం స్కూల్‌లో విద్యార్థులకు క్రీడా దినోత్సవం సందర్భంగా పోటీలు నిర్వహించారు. రోటరీ వైజాగ్ మెట్రో క్లబ్ ఆధ్వర్యంలో విజేతలకు పతకాలు, బహుమతులు అందజేశారు. విన్నర్స్, రన్నర్స్‌తోపాటు ద్వితీయ స్థానంలోని నిలిచిన వారు బహుమతులు అందుకున్నారు. స్కూల్ హెచ్‌ఎం సుమతీ బాయ్, పీఈటీ రత్నం, రోటరీ వైజాగ్ మెట్రో క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏయూలో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు



అధికారులకు సూచనలిస్తున్న వీసీ శశిభూషణరావు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో భారీ సంఖ్యలో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వీసీ ఆచార్య జి.శశిభూషణరావు తెలిపారు. నాలుగేళ్లకుపైబడి వయసున్న వేప, మామిడి, రావి, నేరేడు, బాదం, మర్రి, కదంబరి తదితర మొక్కలు నాటడానికి సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఇప్పటికే వెయ్యికిపైగా మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు ఫెన్సింగ్ ఏర్పాటు చేశామన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుతో కలిసి వీసీ గురువారం ఈ ఏర్పాట్లను పరిశీలించారు. ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో రహదారికి ఇరువైపులా మూడు వరసల్లో మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. మైదానం చుట్టూ మొక్కలు నాటుతామన్నారు.

తేనెలొలుకు తెలుగు.. తరతరాలకు వెలుగు

తేనెలొలుకు తెలుగు భాష ఎంతో గొప్పదని, భావితరాలకు వెలుగునిస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా గురువారం నియోజకవర్గంలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రామమూర్తి పంతులు చిత్రపటాలకు నివాళులర్పించి ఆయన సేవలను వక్తలు, ఉపాధ్యాయులు కొనియాడారు.

- తెలుగు భాషా దినోత్సవంలో వక్తలు
- గిడుగు రామమూర్తికి ఘన నివాళి



విశాఖ వ్యాలీ స్కూల్‌లో వేడుకలు ప్రారంభిస్తున్న తెలుగు కవి మీగడ రామలింగ స్వామి



డాక్టర్ ప్రదీప్ వానపల్లిని సత్కరిస్తున్న గాయత్రి కళాశాల ప్రతినిధులు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు శ్రీకృష్ణాపురంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకులంలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి ప్రిన్సిపాల్ వి.రత్నవల్లి, వైస్ ప్రిన్సిపాల్ బి.కె.రమేష్, తెలుగు ఉపాధ్యాయులు రామారావు, శంకరరావు, చిరంజీవి, ఉపాధ్యాయేతర సిబ్బంది నివాళులర్పించారు. గురుకుల విద్యార్థులకు తెలుగులో వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ బహుమతులు అందజేశారు

విశాఖ వ్యాలీ స్కూల్‌లో తెలుగుకు ప్రాధాన్యం

విశాఖ వ్యాలీ స్కూల్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వేడుకలను ముఖ్య అతిథి ప్రముఖ తెలుగు కవి మీగడ రామలింగ స్వామి ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసి తీసుకొచ్చిన సంప్రదాయ పిండి వంటలను పరిశీలించారు. పిల్లలు జానపద, పౌరాణిక పాత్రల్లో నృత్యాలు చేసి అతిథులు, విద్యార్థుల తల్లిదండ్రులను ఆకట్టుకున్నారు. అతిథులతో కలిసి గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామలింగ స్వామి మాట్లాడుతూ గిడుగు రామమూర్తి పంతులు తెలుగు భాషకు చేసిన సేవలను కొనియాడారు. ప్రస్తుత కాలంలో విశాఖ వ్యాలీ స్కూల్‌లో తెలుగు భాషకు ప్రాధాన్యమివ్వడం విశేషమన్నారు. ఈశ్వరి ప్రభాకర్, విశిష్ట అతిథి మన్నేపల్లి శివశంకరయ్య మాట్లాడుతూ అమ్మ భాషలోని మాధుర్యాన్ని ఎవ్వరూ వెలకట్టలేరన్నారు. తాళపత్ర గ్రంథాల విలువల గురించి వివరించారు. పాఠశాల తెలుగు విభాగం ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణా డిగ్రీ కళాశాలలో..

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు, నవలా రచయిత గొట్టాపు సింహాచలంను ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు సత్కరించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మాతృభాషపై మమకారం ప్రత్యేకమైనదన్నారు. తెలుగు భాష నిత్య జీవనంలో భాగంగా వెలుగొందుతోందని, అందుకు అనుగుణంగా మంచి రచనలు తెలుగులో రావాలన్నారు. సింహాచలం మాట్లాడుతూ గిడుగు రామమూర్తి పంతులు బహుముఖ ప్రజ్ఞాశాలని కొనియాడారు. నేటి తరం తెలుగును ఆకళింపు చేసుకుని పత్రిక రచయితలు సామాజిక స్పృహతో రచనలు చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ కుసుమ కుమారి స్వయంగా రచించిన తెలుగు సాహిత్య కుసుమాలు అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అధ్యాపక బృందం,విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంవీపీ లైబ్రరీ, విద్యా సంస్థల్లో..

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ లైబ్రరీలో వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లైబ్రేరియన్ ఉమా మహేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ తెలుగు భాషకు గిడుగు రామమూర్తి చేసిన కృషిని కొనియాడారు. సచివాలయ ఉద్యోగులు, యువత పాల్గొన్నారు.

◆ ఎంవీపీ కాలనీ గాయత్రి విద్యా పరిషత్ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి అభినవ ధన్వంతరి బిరుదు గ్రహీత డాక్టర్ ప్రదీప్ వానపల్లి తెలుగు విశిష్టతను తెలిపే పద్యాలను ఆలపిస్తూ విద్యార్థుల్లో స్ఫూర్తినింపారు. ఆయనను కళాశాల ప్రతినిధులు సత్కరించారు. కళాశాల యాజమాన్య సభ్యులు డి.వి.ఎస్.కామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఆచార్య కె.ఎస్.బోస్ తదితరులు పాల్గొన్నారు.

◆ శ్రీసత్యసాయి విద్యావిహార్ స్కూల్‌లో విద్యార్థులు తెలుగు విశిష్టతను చాటే కార్యక్రమాలను నిర్వహించారు. తెలుగు సాహిత్యం గొప్పతనాన్ని తెలియజేస్తూ పద్యాలు ఆలపించారు. ప్రిన్సిపాల్ చేకూరి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషను కాపాడుకుందాం

మాతృభాషకు ఇచ్చే ప్రాధాన్యంలో తెలుగు వారు ఇంకా మెరుగుపడాల్సిన అవసరం ఉందని తెలుగు పద్యా పీఠం అధ్యక్షుడు పరవస్తు ఫణిశయన సూరి అన్నారు. ఏయూలోని తెలుగు విభాగంలో గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి, తెలుగు తల్లి చిత్రపటాలకు అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఫణిశయన సూరి మాట్లాడుతూ మాతృభాషా ప్రాధాన్యతలో ఆంధ్రప్రదేశ్‌కు పొరుగున ఉన్న రాష్ట్రాలు ముందు వరసలో ఉన్నాయన్నారు. అక్కడి ప్రజలు సైతం మాతృభాషాకు విశిష్ట ప్రాధాన్యమిస్తున్నారని తెలిపారు. ఇదే తరహాలో తెలుగు వారు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు తెలుగు భాష విశిష్టత, తెలుగు భాషాభివృద్ధికి మహనీయులు చేసిన కృషిని వివరించారు. డాక్టర్ మరడాన సుబ్బారావు, ఏయూ పూర్వ ఆచార్యుడు వెలమల సిమ్మన్న మాట్లాడుతూ తొలి తెలుగు భాషావేత్తగా, అంతర్జాతీయ భాషా శాస్త్రవేత్తగా, శాసనాల పరిశీలకుడిగా, వ్యవహారిక భాషోద్యమ పితామహుడిగా, విమర్శకుడిగా గిడుగు కీర్తిగడించారన్నారు. ఆయని తెలుగు భాషా వికాసానికి అందించిన సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఏయూ తెలుగు విభాగాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ ఈశ్వరమ్మ, డాక్టర్ లావణ్య, డాక్టర్ వెంకటస్వామి, డాక్టర్ రత్నశేఖర్, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ సీతారత్నం, డాక్టర్ గిరీష్‌కుమార్, పరిశోధక విద్యార్థి మమత తదితరులు పాల్గొన్నారు.



కృష్ణా కళాశాలలో గొట్టపు సింహాచలంను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు



గురుకులంలో గిడుగు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు



ఎంవీపీ కాలనీ లైబ్రరీలో గిడుగు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యువత



పద్యాలు ఆలపిస్తున్న సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు



ఏయూ తెలుగు విభాగంలో గిడుగు, తెలుగు తల్లి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్యులు

మైమరపించిన నర్తనశాల పద్య నాటకం



నర్తనశాల నాటకంలోని ఓ సన్నివేశం



ఆచార్యులు శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

మద్దిలపాలెం: కళాభారతి, విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ 38వ వార్షికోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. ఆరు రోజుల పాటు జాతీయ సంగీత నృత్యోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆఖరి రోజున తిరుపతికి చెందిన సుబ్బరాజు నాట్య కళాపరిషత్ వారిచే నర్తనశాల పాన్ ఇండియా పద్య నాటక ప్రదర్శించారు. కార్యక్రమాన్ని ముఖ్య అతిథి ఆచార్యులు శ్రీకాంత్‌తో కలిసి వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్.రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, కోశాధికారి పైడా కృష్ణప్రసాద్‌లు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మహాభారతం విరాటపర్వంలోని కథాంశం ఇతివృత్తంగా అద్భుతమైన సన్నివేశాలు, సందర్భోచితమైన పద్యాలతో నర్తనశాల నాటకాన్ని రక్తికట్టించి అద్యంతం ప్రేక్షకుల హృదయాలను కట్టిపడేశాల ప్రదర్శించి మైమరపించారు.

'కోనేటి'కి నాటక కళాభారతి బిరుదు

సుబ్బరాజు నాట్యకళాపరిషత్ వారిచే ప్రదర్శించిన నర్తనశాల నాటక రచయిత, దర్శకుడు కోనేటి సుబ్బరాజును నాటక కళాభారతి బిరుదుతో వీఎండీఏ ప్రతనిధులు ఘనంగా సత్కరించారు.

విమ్స్‌లో నర్సింగ్ సిబ్బంది నిర్లక్ష్యం..!

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో రోగుల పట్ల నర్సింగ్ సిబ్బంది నిర్లక్ష్యం చూపుతున్నారు. ఇక్కడ కొందరు నర్సింగ్ సిబ్బందిపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గురువారం ఉదయం ఇద్దరు ఇన్ పేషెంట్లకు అందించే సేవల్లో నిర్లక్ష్యం బయటపడింది. న్యూరో సర్జరీ విభాగంలో మంగళవారం ఓ వ్యక్తికి, బుధవారం మరో వ్యక్తికి కీలకమైన శస్త్రచికిత్సలు జరిగాయి. వారిద్దరు ప్రస్తుతం ఐసీయూ–5లో ఉంటున్నారు. ఆ వార్డులో ఉన్న ఆ ఇద్దరు పేషెంట్లకు షిఫ్టుకు నలుగురు చొప్పున నర్సింగ్ సిబ్బంది సేవలు అందిస్తున్నారు. అంతవరకు బాగానే ఉంది. మంగళవారం రాత్రి, బుధవారం రాత్రి షిఫ్ట్‌ల్లో ఉన్న నర్సింగ్ సిబ్బంది ఆ పేషెంట్లకు సరిగా సేవలు అందించలేదని తెలిసింది. సర్జరీలు జరిగి ఐసీయూలో ఉన్న పేషెంట్లకు రాత్రిళ్లు తరుచూ బీపీ, ఆక్సిజన్ తదితర వాటిని చెక్ చేస్తుండాలి. ఇక్కడ నర్సింగ్ సిబ్బంది పట్టించుకోకుండా వదిలేయడంతో ఆ పేషెంట్లకు గురువారం తెల్లవారే సరికి పరిస్థితి విషమించినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయం తెలుసుకున్న విమ్స్‌లో అనస్తీషియన్లు ఇద్దరు పేషెంట్లను పరిశీలించి తగిన వైద్య సేవలు అందించడంతో కోలుకున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా అలాంటి వ్యవహారం ఏమీ విమ్స్‌లో జరిగినట్లు తనకు ఎలాంటి సమాచారం లేదని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. దీనిపై పరిశీలించి నిర్లక్ష్యం వహించినట్లు వెల్లడైతే డ్యూటీలో ఉన్న నర్సింగ్ సిబ్బందిపై చర్యలు తీసుకుటామని ఆయన చెప్పారు.

జ్ఞాన సరస్వతి విగ్రహావిష్కరణ



జీవీఎంసీ పాఠశాలలో విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఈవోలు రామారావు, బాలామణి

మద్దిలపాలెం: పాత వెంకోజీపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో గురువారం జ్ఞాన సరస్వతి విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన విగ్రహ దాత మళ్ల వెంకటప్పారావుతో కలిసి మండల విద్యా శాఖాధికారులు రామారావు, బాలామణి, కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు. జ్ఞాన సరస్వతీ దేవి ఆశీస్సులు ప్రతి విద్యార్థిపై ఉండాలని, ఉన్నత విద్యలో రాణించాలని వెంకటప్పారావు ఆకాంక్షించారు. పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో బీసీలకు ప్రాధాన్యం కల్పించాలి

ఎంవీపీకాలనీ: నామినేటెడ్ పదవుల్లో బీసీలకు ప్రాధాన్యం కల్పించాలని అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లగుడు గోవిందరావు డిమాండ్ చేశారు. ఎంవీపీ కాలనీలోని ఓ హోటల్లో బీసీ నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో అత్యధిక శాతంగా ఉన్న బీసీలకు ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యమివ్వాలన్నారు. నామినేటెడ్ పోస్టుల్లో 30 శాతం బీసీలకు కేటాయిస్తామంటూ కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో సైతం వెల్లడించిందన్నారు. అయితే బీసీలకు 50 శాతం పోస్టులు కేటాయించాలన్నారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి బీసీ జనాభా సంఖ్యను తెలియపర్చాలని డిమాండ్ చేశారు. తద్వారా బీసీల అభ్యున్నతికి కృషి చేయడంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖలు ఏర్పాటు చేయాలన్నారు. బీసీల సమస్యల పరిష్కారానికి త్వరలో రాష్ట్ర, కేంద్ర మంత్రులను కలిసి వినతిపత్రాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. పలువురు బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ పరిధిలో మరమ్మతులు కారణంగా దీన్‌దయాల్‌పురం, హెల్త్‌సిటీ, సిద్ధార్థనగర్, వాణిజ్య పన్నుల విభాగం కార్యాలయం, చినగదిలి, పెదగదిలి, సాలిపేట, తోటగరువు, రవీంద్రనగర్, గాంధీనగర్, బాలాజీనగర్, శ్రీహరినగర్, డ్రైవర్స్‌కాలనీ, ముస్తఫాకాలనీ, పార్వతీనగర్, బి.టి.ఆర్.నగర్, ఎస్.ఎస్.ఎం.కె టవర్స్, టి.ఐ.సి పాయింట్, కోకో కోలా బిల్డింగ్ ఏరియా, సుందరయ్యనగర్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

మైకేల్ జాక్సన్ పాటలకు నోటితో సంగీతం

- నేడు కళాభారతిలో కార్యక్రమం

డాబాగార్డెన్స్: అంతర్జాతీయంగా సంగీత ప్రియులను ఉర్రూతలూగించిన మైకేల్ జాక్సన్ జయంతిని పురస్కరించుకుని ఆయన పాటలకు మిమిక్రీ కళాకారుడు డీటీఎస్ రమేష్ తన నోటితో సంగీత ప్రదర్శన ఇవ్వనున్నారు. విశాఖలో ఇంగ్లిష్ వెస్ట్రన్ నైట్‌గా చూపించబోతున్న ఈ కార్యక్రమంలో మైకేల్ జాక్సన్ 10 పాటలకు రమేష్ సంగీతాన్ని అందించనున్నారు. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియం వేదికగా శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రమేష్ కోరారు.